సాక్షి కర్నూలు

ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల అన్నప్రసాద వితరణకు శనివారం హైదరాబాద్‌కు చెందిన ఎం.కరుణకుమార్ రూ.1,11,001 విరాళాన్ని అందజేశారు. దాతకు జ్ఞాపికను అందజేసి సత్కరించారు.



ఒకేరోజు రూ.3.81లక్షల ఆదాయం

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహ స్వామి ఆలయానికి శ్రావణమాస నాలుగో శనివారం సందర్భంగా ఒకే రోజు రూ.3,81,411 ఆదాయం సమకూరింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	1,633 అడుగులు
ప్రస్తుతం	1,631.43
టీఎంసీల సామర్థ్యం	105.788
ప్రస్తుతం	97.543
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	42,142
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	10,067

న్యూస్‌రీల్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 08518-277305 ఫోన్ చేయాలన్నారు. రెవెన్యూ, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, మునిసిపల్, రహదారులు-భవనాల శాఖల అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా, ఎవరైనా ప్రమాదాల్లో చిక్కుకుంటే రెస్క్యూ ఆపరేషన్ ద్వారా రక్షించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వాగులు, వంకలు, నదులు, చెరువుల వద్దకు వెళ్లొద్దని ప్రజలకు సూచించారు. అంతకుముందు సీఎం చంద్రబాబు నాయుడు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా వర్షాల ప్రభావంపై కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్షించారు. క్షేత్ర స్థాయిలో ఉండే అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించినట్లు కలెక్టర్ వివరించారు.

ధరల పెరుగుదలపై నేటి నుంచి ఆందోళనలు

కర్నూలు(సెంట్రల్): నిత్యావసరాల ధరలను తగ్గించాలని కోరుతూ ఆదివారం నుంచి ఈనెల 6వ తేదీ వరకు అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6న కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా ఉంటుందన్నారు. గ్యాస్ సిలిండర్ రూ.950, కేజీ కందిపప్పు రూ.210, వేరుశనగ నూనె రూ.210, బియ్యం కేజీ రూ.70, పెట్రోల్ లీటర్ రూ.110, డీజిల్ రూ.100 చేరుకోవడంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల జీవనం కష్టంగా మారిందన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరురూరల్: కెనరా బ్యాంక్, గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో పశువుల పెంపకం, ఎరువు తయారీపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాఘవేంద్ర చౌదరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. చదవటం, రాయటం వచ్చిన ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన 18-45 సంవత్సరాల వయసు వారు అర్హులన్నారు. 10 రోజుల శిక్షణలో ఉచిత భోజన, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్, 4 ఫొటోలతో 2వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోపు బనవాసి కేవీకేలో దరఖాస్తు అందజేయాలని సూచించారు.

తాగునీరు కలుషితం కానివ్వొద్దు



టి.నాగరాజునాయుడు

కర్నూలు(అర్బన్): వర్షాల కారణంగా మురుగు కాలువలు పొంగి పారిశుద్ధ్య సమస్యలు తలెత్తే అవకాశాన్ని నివారించాలి.. అలాగే తాగునీటి పైప్‌లైన్ల లీకేజీల ద్వారా నీరు కలుషితం కాకుండా తక్షణమే మరమ్మతులు చేయించాలని జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు ఆదేశించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆపత్కాలంలో సేవలు అందించేందుకు వీలుగా గ్రామ స్థాయిలో పనిచేసే సిబ్బంది మొబైల్ నెంబర్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ట్యాంకులను నింపిన ప్రతిసారి క్లోరినేషన్ చేపట్టాలని, అవసరమైతే సూపర్ క్లోరినేషన్ కూడా చేయించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తాగునీటిని వేడి చేసి చల్లార్చి తాగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా పారిశుద్ధ్య లోపం వల్ల సమస్యలు తలెత్తితే సంబంధిత పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

నమ్మకం పోతోంది



కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండున్నర నెలలు గడిచింది. ఇప్పటి వరకు ఉద్యోగుల ప్రయోజనాలు చెల్లించే దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఉద్యోగుల్లో ఒకింత అసంతృప్తితో నమ్మకం కోల్పోతున్నారు. దసరా నాటికైన పెండింగ్ బకాయిలను చెల్లిస్తే సంతోషిస్తాం.

– రమణ, ఆర్ అండ్ బీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, కర్నూలు

చొరవ చూపాలి




ప్రతి నెలా 1వ తేదీనే బ్యాంకు ఖాతాలకు పెన్షన్ విడుదల చేయాలి. 2018 జూలై నుంచి డీఏ అరియర్స్ పెండింగ్ ఉంది. 11వ పీఆర్‌సీ వేతన వ్యత్యాసం విషయంలోనూ న్యాయం చేయాలి. ఎంతో నమ్మకం పెట్టుకున్న పెన్షనర్లకు సత్వరం న్యాయం చేయాలి.

– ఎస్.ప్రహ్లాదరావు, పెన్షనర్ల సంఘం నాయకులు, కర్నూలు



ఓడిన ఉద్యోగులు!



ప్రభుత్వం ఏర్పాటై 75 రోజులు

- ఉద్యోగ సంఘాల నేతలకు అపాయింట్‌మెంట్ కూడా కరువే..
- ప్రభుత్వంపై పెదవి విప్పటానికి వెనకడుగు
- ఒక్కో ఉద్యోగికి సుమారు రూ.5 లక్షల చెల్లింపులు బంద్
- 1995 నాటి ముఖ్యమంత్రిని చూస్తారంటూ బెదిరింపులు
- పలు కార్యక్రమాల్లో ఉద్యోగులను అవమానించేలా వ్యాఖ్యలు

ఎన్నికలకు ముందు అన్ని వర్గాలతో పాటు ఉద్యోగులకు కూడా చంద్రబాబు హామీలిచ్చి అరచేతిలో స్వర్గం చూపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండున్నర నెలలైనా ఉద్యోగులకు చెల్లించాల్సినవి ఏవైనా చెల్లించారా అంటే ఒక్కటీ లేదని స్పష్టమవుతోంది. అయితే దీనిపై అడగడానికి ఉద్యోగులు భయపడుతున్నారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం పెట్టాలని కోరుతున్నా స్పందించే వారు కరువయ్యారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఉద్యోగులకు మళ్లీ బెదిరింపులు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్యోగుల పట్ల మళ్లీ బెదిరింపు ధోరణికి దిగుతున్నారు. 75 రోజుల్లోనే పలు కార్యక్రమాల్లో ఉద్యోగులను అవమాన పరిచే విధంగా.. బెదిరించే విధంగా మాట్లాడం సర్వత్రా చర్చనీయాంశమైంది. నాలో మళ్లీ 1995 నాటి ముఖ్యమంత్రిని చూస్తారంటూ బహిరంగంగా బెదిరిస్తుండటంతో ఉద్యోగుల్లో గుబులు మొదలైంది.

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం ఉద్యోగుల వ్యతిరేకతను ఎదుర్కొనేందుకు ఇప్పటి వరకు ఒకటి రెండు రోజులు అటుఇటుగా జీతాలను మాత్రమే చెల్లిస్తోంది. అయితే పెండింగ్ అంశాల విషయంలో మాత్రం నోరు మెదపని పరిస్థితి. ఈ విషయాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలసి పరిష్కరించాలని కోరడానికి రాష్ట్ర స్థాయి ఉద్యోగ సంఘాల నేతలు ప్రయత్నిస్తున్నా కనీసం అపాయింట్‌మెంట్ దొరకని పరిస్థితి నెలకొనడం గమనార్హం.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఆర్థిక ప్రయోజనాలు

ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దాదాపుగా చెల్లించింది. 2019లో జరిగిన ఎన్నికల నాటికి చంద్రబాబు పెండింగ్‌లో పెట్టిన డీఏలను సైతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెల్లించింది. ఇక 2024 ఎన్నికల సమయానికి ఒక్క డీఏ కూడా పెండింగ్‌లో లేదు. 2023 మార్చి నాటికి జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ చెల్లింపులు పూర్తయ్యాయి. 2023 వరకు సరెండర్ లీవ్‌లు కూడా మంజూరు చేసింది. సీపీఎస్ స్థానంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు ప్రయోజనం చేకూరే విధంగా జీపీఎస్‌ను తీసుకొచ్చింది. అప్పట్లో జీపీఎస్‌ను టీడీపీ, జనసేనతో పాటు ఉద్యోగ సంఘాలు వ్యతిరేకించిన విషయం తెలిసిందే.

పెండింగ్‌లో అన్ని ప్రయోజనాలు

- 2004లో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పాలన బాధ్యతలు చేపట్టిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చంద్రబాబు హయాంలోని పెండింగ్ డీఏలు ఇచ్చారు.
- 2019లో ముఖ్యమంత్రి బాధ్యతల నుంచి చంద్రబాబు దిగిపోయే సమయానికి మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి.
- వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఎన్నికల కోడ్ వచ్చే సమయానికి ఒక్క డీఏ కూడా పెండింగ్ లేకుండా చెల్లించింది.
- 2024 జూలై ఒకటి నుంచి చెల్లించాల్సిన డీఏ మాత్రమే ఇప్పుడు పెండింగ్‌లో ఉంది.
- 2014-15 సంవత్సరం నుంచి డీఏ అరియర్స్ పెండింగ్‌లో ఉన్నాయి.
- వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం 60 నెలలు మాత్రమే అధికారంలో ఉంది. 160 నెలల డీఏ అరియర్స్ పెండింగ్‌లో ఉన్నాయంటే ఉమ్మడి రాష్ట్రం నుంచే డీఏ అరియర్స్ పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.
- 2014-15 నుంచి 2018-19 వరకు డీఏ అరియర్స్ పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.
- రెండు సరండర్ లీవ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి కూడా ఈ ఆర్థిక సంవత్సరంలోనివే.
- ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఏపీజీఎల్ఐ చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి.
- ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జీపీఎఫ్ చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి.
- ఒక్కో ఉద్యోగికి సగటున రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి.
- పెన్షనర్లకు చెల్లించే పెన్షన్‌లోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. పెన్షనర్ల ప్రయోజనాలు అనేకం పెండింగ్‌లో ఉన్నాయి. కానీ ఉద్యోగ సంఘాల నేతలు ఎవ్వరూ వీటిపై స్పందించని పరిస్థితి.

సచివాలయ వ్యవస్థతో ఆడుకుంటున్న ప్రభుత్వం

జాబు రావాలంటే బాబు రావాలి, ఇంటికో ఉద్యోగం అంటూ టీడీపీ 2014 ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక.. ఐదేళ్లలో ఇచ్చిన ఉద్యోగాలు 34 వేల లోపే. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి లక్షన్నరకుపైగా ఉద్యోగాలు కల్పించింది. మిగిలిన శాఖల్లో మరో లక్ష వరకు ఉద్యోగాలు భర్తీ చేయడం విశేషం. సచివాలయ, ఆర్‌బీకే వ్యవస్థల ఏర్పాటుతో అధికారులపై పని ఒత్తిడి గణనీయంగా తగ్గింది. అవినీతికి అవకాశం లేకుండా సంక్షేమ పథకాలు ప్రజలకు అందాయి. తాజాగా ప్రభుత్వం సచివాలయ వ్యవస్థతోనూ ఆడుకుంటోంది. రానున్న రోజుల్లో తమ భవితవ్యం ఏమిటో తెలియక సచివాలయ ఉద్యోగుల ఆందోళన అంతా ఇంతా కాదు.



కమ్ముకున్న ముసురు



కర్నూలు నగరంలో రోజంతా గోడుగులతోనే ప్రజల రాకపోకలు

మండలం	వర్షపాతం
కోసిగి	42.2
కర్నూలు అర్బన్	34.6
పెద్దకడుబూరు	35.4
చిప్పగిరి	35.2
ఎమ్మిగనూరు	34.8
మంత్రాలయం	34
దేవనకొండ	27.6
కల్లూరు	27.2
గోనెగండ్ల	26.4
నందవరం	23.2
ఓర్వకల్లు	20

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాను ముసురు కమ్ముకుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు అన్ని మండలాల్లో వర్షం కురిసింది. శనివారం ఉదయం నుంచి తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా మొత్తంగా సగటున 19.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కర్నూలు రూరల్‌లో 42.4 మి.మీ, అత్యల్పంగా ఆలూరులో 4.2 మి.మీ వర్షం కురిసింది. జిల్లాను ముసురు కమ్ముకోవడంతో పంటలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. చేతికి వచ్చిన ఉల్లిగడ్డలు వానకు తడిసి దెబ్బతింటున్నాయి. మొక్కజొన్న, మిర్చి, పత్తి పంటలు అధిక వర్షాలతో దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. మరోవైపు చీడపీడల సమస్యలు పెరుగుతున్నాయి. కాగా జిల్లాలోని 11 మండలాల్లో 5,203 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లిందని అధికారులు పేర్కొన్నారు. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ ఉండగా.. 200.1 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఆ నిధులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోవే

- టీడీపీ సభ్యుల అబద్ధపు ప్రచారాన్ని తిప్పికొట్టిన వైఎస్సార్‌సీపీ సభ్యులు



వైస్ చైర్మన్‌తో వాగ్వాదానికి దిగిన టీడీపీ కౌన్సిలర్లు

ఎమ్మిగనూరుటౌన్: రూ.142 కోట్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మంజూరు చేయించారని వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ అన్నారు. వాటిని కూడా టీడీపీ సభ్యులు తామే మంజూరు చేయించామనడం సిగ్గుచేటన్నారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు అధ్యక్షతన శనివారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో ముందుగా అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం సభ్యులు వివిధ సమస్యలు లేవనెత్తారు. ఏఐఐబీ స్కీం కింద రూ.142 కోట్లను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి మంజూరు చేయించారని టీడీపీ సభ్యుడు దయాసాగర్ చెప్పడంతో.. వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ కలుగజేసుకొని ఆ నిధులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మంజూరు చేయించారని గుర్తు చేయడంతో టీడీపీ సభ్యులు తెల్లమోహం వేశారు. స్వలాభాల కోసం పార్టీ ఫిరాయించడం పద్ధతి కాదని, అలాంటి వారు రాజీనామాలు చేసి గెలవాలని వైస్ చైర్మన్ అనడంతో.. ఫిరాయింపుదారులు వాగ్వాదానికి దిగారు. ఇరు పక్షాలను సముదాయించినా సభ కొలిక్కి రాకపోవడంతో సభను ముగిస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. సమావేశంలో మున్సిపల్ డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

నేటి నుంచి 'స్వచ్ఛ పఖ్వాడ'

కర్నూలు సిటీ: జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో ఆదివారం నుంచి స్వచ్ఛ పఖ్వాడ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని డీఈఓ కె.శామ్యూల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను చేపట్టాలని, 15న ముగింపు కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు అందజేయాలని డీఈఓ పేర్కొన్నారు.

'ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ' మాటల్లోనే!



కర్నూలు నగరం బుధవారపేటలోని 36వ సచివాలయం వద్ద పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు

కర్నూలు(అగ్రికల్చర్): ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ అభాసుపాలవుతోంది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులతో పింఛన్‌దారులకు ఇంటి వద్దే పింఛన్ పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా అది కేవలం 20 నుంచి 30 శాతానికే పరిమితమవుతోంది. 70 శాతం పింఛన్ల పంపిణీ గ్రామ, వార్డు సచివాలయాలు, రచ్చబండలు, ప్రధాన కూడళ్లలోనే జరుగుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఓర్వకల్లులో సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో పాల్గొనాల్సి ఉండగా వర్షాల కారణంగా కార్యక్రమం రద్దయింది. సెర్ప్ సీఈఓ వీరపాండ్యన్, జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితా రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సలీం బాషా పింఛన్లు పంపిణీ చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లో 70 శాతం పింఛన్లు సచివాలయాల్లోనే పంపిణీ చేయడం గమనార్హం. ఇదిలాఉంటే ఏకంగా టీడీపీ నేతలు పింఛన్లు పంపిణీ చేయడం పట్ల సర్వత్రా ఆశ్చర్యం వ్యక్తమవుతోంది.

- కర్నూలు జిల్లాలో 2,42,583 పింఛన్లు ఉండగా, శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి 2,33,453 పింఛన్లు పంపిణీ చేశారు. 96.24 శాతం పంపిణీ పూర్తయ్యింది. పంపిణీలో కర్నూలు జిల్లా రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచింది.
- నంద్యాల జిల్లాలో 2,19,046 పింఛన్లు ఉండగా, శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి 2,07,003 పింఛన్లు పంపిణీ చేశారు. 94.5 శాతం పంపిణీ పూర్తయ్యింది. పంపిణీలో నంద్యాల జిల్లాకు రాష్ట్రంలో 17వ స్థానంలో నిలిచింది.

సర్పంచ్ వలస బాట

గోనెగండ్ల: మండల పరిధిలోని హెచ్. కైరవాడి గ్రామ సర్పంచ్ ఎస్.సువర్ణమ్మ బతుకు దెరువు కోసం వలస వెళ్లారు. భర్త, కూతురితో కలిసి నెల రోజుల క్రితం ఆమె గ్రామం వదిలి తెలంగాణ రాష్ట్రం గద్వాలకు వలస వెళ్లినట్లు సమాచారం. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తామని, ఉన్న చోటే ఉపాధి చూపుతాని అధికారులు, నాయకులు చెప్పే మాటలు.. సర్పంచ్ వలస ఘటనతో ఉత్తుత్తేనని తేలిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పాలన గాడి తప్పింది. ఎక్కడా ఉపాధి పనులు ప్రారంభించిన దాఖలాలు లేవు. వ్యవసాయ పనులు కూడా అంతంత మాత్రమే. ఫలితంగా పశ్చిమ ప్రాంతం ఇప్పటికే వలస బాట పట్టింది. గ్రామ సర్పంచ్‌కే ఉపాధి చూపని అధికారులు.. తమలాంటి సామాన్యులను పట్టించుకుంటారా అంటూ హెచ్.కైరవాడి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తాళం వేసిన సర్పంచ్ సువర్ణమ్మ ఇల్లు

ఏ'మార్చు'తున్నారు' జాగ్రత్త!!

- సెకండ్ హ్యాండ్ ఆటోలు, ద్విచక్ర వాహనాల విక్రయాల్లో మోసం
- జిల్లాలో పాత బైక్‌లు, ఆటోలు అమ్మే దుకాణాలు 26
- అనధికారికంగా మరికొన్ని..
- నంబర్ ప్లేట్లు, ఛాసిస్‌లు మార్చి విక్రయాలు

కర్నూలు: ద్విచక్ర వాహనాలు, ఆటోలు నిత్యావసరంగా మారడంతో పేద, మధ్య తరగతి వారు తక్కువకు వస్తున్నాయని సెకండ్ హ్యాండ్ వాహనాల కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. వాహనం తక్కువకు వస్తుందనే ధ్యాసలో పూర్తిస్థాయిలో విచారణ చేయకపోవడం, పరిశీలించకపోవడంతో తదనంతరం ఇబ్బందుల పాలవుతున్నారు. కొందరైతే ఆర్థికంగా నష్టపోతున్నారు.

➡ కర్నూలులోని ఒక ఫైనాన్స్ కంపెనీలో పాతబస్తీకి చెందిన ఇక్బాల్ అహ్మద్ బైక్ కొనుగోలు చేశాడు. కొంత కాలానికే అది మరమ్మతులకు గురి కావడంతో మెకానిక్ వద్దకు వెళ్లగా ఇంజిన్ పాడైపోయిందని తెలిపాడు. కొనుగోలు చేసి ఏడాది కూడా కాలేదని చెప్పగా అప్పటికే 15 ఏళ్లు దాటిందని, కొన్ని పరికరాలు మార్చి అంటగట్టారని సమాధానమిచ్చాడు. ఫైనాన్స్ కంపెనీ వద్దకు వెళ్లగా ఇలాంటివన్నీ ముందే చూసుకోవాలని, తమకు సంబంధం లేదంటూ చేతులెత్తేశాడు.

➡ కల్లూరులో దొంగతనం జరిగిన బైక్‌ను సామాన్లు మార్చేసి మరొకరికి విక్రయించారు. అది మరమ్మతులకు గురవడంతో కొనుగోలు చేసిన వ్యక్తి మెకానిక్ వద్దకు తీసుకెళ్లగా దానిని గుర్తుపట్టిన మెకానిక్.. అసలు యజమానికి సమాచారమిచ్చాడు. రూ.16 వేలకు కొనుగోలు చేశానని చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడంతో అప్పటికే ఫిర్యాదు చేసిన అసలు యజమానికి బైకు అప్పగించారు.

సెకండ్ హ్యాండ్ షోరూమ్‌లకు వెళ్తే..

సాధారణంగా సెకండ్ హ్యాండ్ షోరూమ్‌లకు వెళ్తే ఎంత ధరలో కావాలి అని అడుగుతారు. మన ఆర్థిక స్థాయిని బట్టి రికార్డులు లేనివి కూడా చూపిస్తారు. కొంతమంది సామాన్లు మార్చేసి విక్రయిస్తున్నారు. రూ.లక్ష విలువ చేసే బైక్‌ను ఆన్‌లైన్‌లో రూ.20 నుంచి రూ.50 వేల మధ్యలో విక్రయిస్తున్నట్లు పెడుతున్నారు. తక్కువ ధరకు వస్తుందని కొందరు ఏమీ తెలుసుకోకుండానే కొని మోసపోతున్నారు.

ఛాసిస్ నెంబర్ మార్చేస్తున్నారు

బైక్‌లు, స్కూటీలు, ఆటోలకు అతి ముఖ్యమైనది ఛాసిస్ నెంబర్. బండి నెంబర్ ప్లేట్లు ఎన్ని మార్చినా ఛాసిస్ నెంబర్ ఆధారంగానే దాని సమాచారాన్ని రవాణా శాఖ అధికారులు వెల్లడిస్తారు. కొంతకాలంగా ఛాసిస్ నెంబర్లు కూడా మార్చేస్తున్నారు. దొంగతనం చేసిన వాహనాలకు వినియోగంలో లేని వాహనాల ఛాసిస్ నెంబర్లు వేసి, నెంబర్ ప్లేట్ మార్చి అమ్మేస్తున్నారు. వీటిని కనిపెట్టడం పోలీసుల వల్ల కూడా కావడం లేదు. ఇతర రాష్ట్రాల్లో దొంగలు కొట్టేసిన వాహనాలకు ఇక్కడి రిజిస్ట్రేషన్ నెంబర్ వేసి విక్రయిస్తున్నారని బైక్ మెకానిక్‌లు వాపోతున్నారు. కర్నూలు సి.క్యాంప్‌లోని చర్చిలో పనిచేసే ధనరాజు బుల్లెట్ వాహనం చోరీకి గురైంది. కర్నూలుకు చెందిన పాత నేరస్తుడు బండారి తేజ చోరీ చేసి రూ.లక్షకు పైగా విలువ చేసే ఆ వాహనాన్ని రూ.20 వేలకే విక్రయించి వచ్చిన సొమ్ముతో జల్సా చేశాడు. పక్కా ఆధారాలతో పోలీసులు దొంగను పట్టుకుని 16 ద్విచక్ర వాహనాలను రికవరీ చేశారు. అందులో కొన్నింటికి ఛాసిస్ నెంబర్లు, మరి కొన్నింటికి నెంబర్ ప్లేట్లు మార్చి విక్రయాలు జరిపినట్లు విచారణలో బయటపడింది. అలాగే హైదరాబాద్ చార్మినార్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ అలీ, అతని సోదరి భర్త సయ్యద్ సమీర్, ఆటోడ్రైవర్లు జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించే మార్గాన్ని ఎంచుకున్నారు. కర్నూలులోని వివిధ ప్రాంతాల్లో విడతల వారీగా 14 ఆటోలు చోరీ చేసి వాటికి తెలంగాణ రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్లు తగిలించి విక్రయించారు. పక్కా ఆధారాలతో పోలీసులు ఇరువురిని అరెస్టు చేసి ఆటోలను తిరిగి బాధితులకు అప్పగించారు.



తెలంగాణ నెంబర్ ప్లేట్లు అతికించి దొంగలు విక్రయించగా కర్నూలు పోలీసులు రికవరీ చేసిన ఆటోలు

ఎఫ్ఐఆర్ జిరాక్స్ ఇవ్వాలి



వాహనం చోరీకి గురైతే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. వారు ఎఫ్ఐఆర్ నమోదు చేసుకుంటున్నారు. ఆ కాపీని జిరాక్స్ తీసుకుని రవాణా శాఖ కార్యాలయంలో సమర్పిస్తే.. వాహనం ఇతరులపై రిజిస్ట్రేషన్ కాకుండా చర్యలు తీసుకోవచ్చు. అలాగే బండి కొనుగోలు చేసేటప్పుడు కూడా ఆ వివరాలను రవాణా శాఖ కార్యాలయానికి తీసుకువస్తే పూర్తి వివరాలు బయటపడతాయి.

– రమేష్, ఆర్‌టీఓ

క్లుప్తంగా

శేషజీవితం సంతోషంగా గడపాలి



పదవీ విరమణ పొందిన ఏఎస్‌ఐలను సత్కరిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు: ఉద్యోగ విరమణ తర్వాత మిగిలిన జీవితాన్ని సంతోషంగా గడపాలని ఎస్పీ బిందు మాధవ్ సూచించారు. కర్నూలు మూడో పట్టణ పీఎస్ ఏఎస్‌ఐ టి.దస్తగిరి సాహెబ్, కొత్తాళం పీఎస్ ఏఎస్‌ఐ బి.సూర్యనారాయణరెడ్డి శనివారం పదవీ విరమణ పొందారు. వారిని క్యాంపు కార్యాలయానికి రప్పించి శాలువా, పూలమాలలతో ఎస్పీ సత్కరించారు. పదవీ విరమణ సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్, ఆర్‌ఐ నారాయణ, ఎస్‌ఐ హనుమంతయ్య, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

ఇంటెలిజెన్స్ డీఎస్పీ బదిలీ

కర్నూలు: కర్నూలు రేంజ్ ఇంటెలిజెన్స్ విభాగం డీఎస్పీ సీతారాంను బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. 1995లో ఎస్‌ఐ హోదాలో పోలీసు శాఖలో చేరిన సీతారాం కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో పనిచేశారు. 2021లో డీఎస్పీగా పదోన్నతి పొంది ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తుండగా సాధారణ బదిలీల్లో భాగంగా ఆయనను వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేసి పోలీసు హెడ్ క్వార్టర్‌లో రిపోర్టు చేసుకోవలసిందిగా అందులో పేర్కొన్నారు. ఈయన కర్నూలు ఏసీబీ విభాగానికి నియమితులయ్యే అవకాశమున్నట్లు పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. గతంలో సీఐగా ఏసీబీలో సేవలందించారు. ఇక్కడ ఉన్న డీఎస్పీ వెంకటాద్రి ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత (మూడు మాసాల క్రితం) చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఈ స్థానం ఖాళీగా ఉంది. సీతారాంను ఈ పోస్టుకు నియమించే అవకాశమున్నట్లు సమాచారం. అలాగే ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న పవన్‌కిషోర్‌కు కూడా స్థానచలనం కలిగింది. ఈయనను కూడా వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈయన ఎక్కువకాలం లూప్‌లైన్ విభాగాల్లోనే పనిచేశారు.

తోటి విద్యార్థుల ఉదారత



చంద్రశేఖర్‌కు నగదు అందిస్తున్న ఉపాధ్యాయులు

ఆలూరు/ఆలూరు రూరల్: తండ్రి మృతి చెంది, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థికి ఆర్థిక సాయం అందించి తమ ఉదారతను చాటుకున్నారు అరికెర గురుకుల పాఠశాల విద్యార్థులు. ఆదోని మండలం మదిరే గ్రామానికి చెందిన చంద్రశేఖర్ అరికెర గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల తన తండ్రి సిద్దప్ప గుండెపోటుతో మృతిచెందాడు. తండ్రి అంత్యక్రియలు పూర్తి చేసి మూడు రోజుల క్రితం తిరిగి పాఠశాలకు వచ్చిన చంద్రశేఖర్.. ఆర్థిక ఇబ్బందుల వల్ల తాను చదువు మానేయాల్సి వస్తుందని చెప్పి తోటి స్నేహితుల వద్ద బాధను వ్యక్తం చేశాడు. తోటి విద్యార్థులు తమ వంతుగా ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించుకుని, ఇదే విషయాన్ని తమ క్లాస్ హౌస్ మాస్టర్లు నరసింహులు, శ్రీనివాసులుకు చెప్పారు. పోగుచేసిన రూ.5,500 నగదును ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా శనివారం విద్యార్థికి అందించి గొప్ప మనసు చాటుకున్నారు.

ప్రతినెలా పింఛన్ల ప్రచారమే!

ఏదో ఒక జిల్లాకు వెళ్లి ప్రచార ఆర్భాటం

- ముందుగా కర్నూలు జిల్లా పత్తికొండలో సీఎం పర్యటన
- వర్షం కారణంగా ఓర్వకల్లుకు మారుస్తూ రాత్రి నిర్ణయం
- నిద్రాహారాలు మాని ఏర్పాట్లు చేసిన అధికారులు
- ఉదయం వర్షం కారణంగా పర్యటన రద్దంటూ ప్రకటన
- జర్నలిస్టులకు పాస్‌ల విషయంలోనూ వివక్ష



ఓర్వకల్‌లో ఏర్పాటు చేసిన సీఎం సభా ప్రాంగణం

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు ప్రతినెలా పింఛన్లను కొత్తగా ప్రారంభిస్తున్నట్లు ప్రచారం చేసుకోవడం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. జూలైలో మంగళగిరి, ఆగస్టులో మడకశిర నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు స్వయంగా పర్యటించి పెన్షన్లను ఇంటింటా పంపిణీ చేశారు. సెప్టెంబర్ మాసానికి సంబంధించి శనివారం ఆయన కర్నూలు జిల్లా ఓర్వకల్ గ్రామ పంచాయతీలో పర్యటించి ఇంటింటా పెన్షన్లను పంపిణీ చేసి గ్రామస్తులతో ముఖాముఖి చేపట్టాల్సి ఉండగా వరణుడు బ్రేక్ వేశాడు. భారీ వర్షాల కారణంగా సీఎంచంద్రబాబు పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేశారు.

అధికారుల అవస్థలు వర్ణనాతీతం

సీఎం చంద్రబాబు పత్తికొండ నియోజకవర్గంలోని పుచ్చకాయలమాడలో ఇంటింటా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని 30వ తేదీ ఉదయం జిల్లా యంత్రాంగానికి సమాచారం అందింది. దీంతో రెండు రోజుల్లో సీఎం పర్యటన కోసం అధికారులు రేయింబవళ్లు శ్రమించి ఏర్పాట్లను పూర్తి చేశారు. చివరకు శుక్రవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో వర్షాల కారణంగా చంద్రబాబు పర్యటన రద్దయిందని, అయితే ఓర్వకల్ విమానాశ్రయానికి దగ్గరగా ఉన్న ఓర్వకల్‌లోనే పెన్షన్ల పంపిణీలో పాల్గొంటారని, అక్కడే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దీంతో పత్తికొండలో ఉన్న అధికారులు శుక్రవారం రాత్రి ఓర్వకల్‌కు వచ్చి ఏర్పాట్లపై పరిశీలన చేశారు. అప్పటికే జోరు వాన కురుస్తుండడంతో రాత్రంతా అక్కడే ఉండి పోవాల్సి వచ్చింది. ఏమీ చేయలేని పరిస్థితి. ఉదయాన కూడా జోరు వర్షం కురుస్తున్నా ఏర్పాట్లను చేపట్టారు. చివరకు 11 గంటల సమయంలో సీఎం పర్యటనను వర్షాల కారణంగా రద్దు చేసినట్లు ప్రకటించడంతో అధికారులంతా ఊపిరి పీల్చుకున్నారు.

కొన్ని మీడియా సంస్థలకే సీఎం సభకు పాసులు

సమాచార, పౌరసంబంధాల శాఖ సీఎం చంద్రబాబునాయుడు పాల్గొనే సభకు కొన్ని మీడియా సంస్థలకే పాసులను జారీ చేశారు. శనివారం కర్నూలు జిల్లా ఓర్వకల్‌లో జరిగే కార్యక్రమానికి టీవీ9, ఎన్‌టీవీ, 10టీవీ, సాక్షి టీవీ, పేపర్‌కు పాసులు ఇవ్వలేదు. ఆయా సంస్థలకు జిల్లా కలెక్టర్ జారీ చేసిన మీడియా అక్రిడిటేషన్ కార్డులు ఉన్నా పాసులు మాత్రం ఇవ్వలేదు. స్థానిక అధికారులను అడిగితే కమిషనర్ ఆదేశాల మేరకు ఇవ్వలేదని చెప్పడం గమనార్హం.

ప్రతి నెలా సూపర్ సిక్స్ పథకాలను ప్రారంభిస్తే మంచిది!

ఎన్నికలకు రెండేళ్ల ముందు నుంచి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి పేదరికాన్ని నిర్మూలిస్తామని స్వయంగా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తోపాటు టీడీపీ, జనసేన క్యాడర్ మొత్తం ప్రజలకు హామీ ఇచ్చింది. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని పక్కనపెట్టి మిన్నకుండి పోయారు. ఖజానా ఖాళీ అంటూ కాలయాపన చేస్తున్నారు. మరోవైపు గతంలో 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు హామీలు ఇచ్చే సమయంలో ఖజానా ఖాళీ వివరాలు తెలియవా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాగా, సూపర్ సిక్స్‌లో పథకాలను ప్రతి నెలా ఒకదానిని ప్రారంభించి జిల్లాలకు వెళ్లితే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



యాగంటి క్షేత్రం ఆవరణలోని ఓ జలధార భక్తులు, పర్యాటకులను ఆకట్టుకుంటోంది. కొండ మధ్యలో నుంచి జలధార నేలను తాకుతున్న దృశ్యాలు చూస్తుంటే ఏదో సెట్టింగ్ వేశారా అన్నట్లుగా అనిపిస్తోంది. క్షేత్ర పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో నీటి ధార జలపాతంలా మారడంతో భక్తులు సెల్ఫీలు తీసుకుంటూ ఆనందిస్తున్నారు. – బనగానపల్లె రూరల్

గొడుగు కళ్లకు అడ్డుపడి..

- బైక్‌పై వెళ్తూ ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీ
- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



మృతుడు సిద్ధిఖ్

చాగలమర్రి: వైఎస్సార్ జిల్లా జొన్నవరం మెట్ట సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చాగలమర్రికి చెందిన ఓ స్వర్ణకారుడు దుర్మరణం చెందాడు. మృతుడి కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చాగలమర్రి పాత బస్టాండు వీధికి చెందిన మహమ్మద్ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సిద్ధిఖ్ స్వర్ణకారుడు. సొంత పనుల నిమిత్తం శుక్రవారం తన స్నేహితుడు తౌఫిక్‌తో కలసి బైక్‌పై వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు పట్టణానికి వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని రాత్రి తిరిగి చాగలమర్రికి బయలుదేరారు. వర్షం కురుస్తుండటంతో వెనుక కూర్చున తౌఫిక్ గొడుగు పట్టుకున్నాడు. కాగా మార్గమధ్యలో జొన్నవరం మెట్ట సమీపంలో బైక్ నడుపుతున్న సిద్ధిఖ్ కళ్లకు గొడుగు అడ్డుపడటం, ఆ వెంటనే ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సిద్ధిఖ్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో తౌఫిక్ గాయాలతో బయటపడ్డాడు. కేసు నమోదు చేసినట్లు దువ్వూరు ఎస్‌ఐ వినోద్ కుమార్ తెలిపారు. స్వర్ణకారుడు సిద్ధిఖ్ మృతికి సంతాపంగా శనివారం స్వచ్ఛందగా దుకాణాలను మూసి వేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అమీర్‌బాషా, ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎండీ గౌస్ తెలిపారు.

రీచ్‌ల పేరుతో ప్రాణాలు తీయొద్దు

- మైనింగ్ అధికారులకు విన్నవించిన గుడికంబాలి గ్రామస్తులు



అధికారులకు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

కౌతాళం: రీచ్‌లు ఏర్పాటు చేసి తమ పిల్లల ప్రాణాలు తీయొద్దని గుడికంబాలి గ్రామస్తులు అధికారులకు విన్నవించారు. మండల పరిధిలోని గుడికంబాలి, మరళి, నదిచాగి గ్రామాల్లో జిల్లా కాలుష్య మండలి, మైనింగ్, పర్యావరణ శాఖ అధికారులు ఆయా గ్రామాల్లో ఇసుక రీచ్‌ల ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఇసుక రీచ్‌ల వల్ల ఉన్న ఇబ్బందులు తెలపాలని అధికారులు కోరగా గుడికంబాలి గ్రామస్తులు మాట్లాడుతూ ఇసుక లారీలు ఇష్టానుసారంగా రోడ్లపై రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతోపాటు దుమ్ము, ధూళి వల్ల అనారోగ్యాలకు గురవుతున్నామని, రోడ్డు పక్కన ఉన్న పంట పొలాలు దిగుబడులు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గుంతలు తేలిన రోడ్లపై ప్రమాదాలకు గురవుతున్నా కాంట్రాక్టర్ గానీ, మైనింగ్ అధికారులు గానీ పరిహారం అందించకపోవడంతో పలు కుటుంబాలు వీధిన పడినట్లు వివరించారు. ఇసుక రీచ్‌ల వల్ల ప్రభుత్వానికి, కాంట్రాక్టర్‌కు లాభం తప్ప తమ గ్రామానికి ఎలాంటి ఉపయోగం లేకపోవడంతోపాటు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని బస్సు సర్వీసులు కూడా నిలిచిపోయాయని తెలిపారు. తమ పిల్లలు చదువుకునేందుకు హాల్వి గ్రామానికి రాకపోకలు సాగిస్తుంటారని, అదే సమయంలోనే మితిమీరిన వేగంతో ఇసుక లారీలు వెళ్తుంటాయని, ప్రమాదాలు జరిగితే బాధ్యులెవరని ప్రశ్నించారు. అందరి అభిప్రాయాలను ఉన్నతాధికారులకు పంపుతామని, వారి ఆదేశాల మేరకు ఇసుక రీచ్‌లను ప్రారంభిస్తామని మైనింగ్ డీడీ రాజశేఖర్ తెలిపారు. సమావేశంలో ఎన్విరాల్‌మెంట్ ఇంజినీర్ మునిప్రసాద్, జిల్లా ఇరిగేషన్ శాఖ ఈఈ శైలేశ్వరరావు, తహసీల్దార్ మల్లికార్జునస్వామి, ఆర్‌ఐ రాజశేఖర్‌గౌడ్, వీఆర్వో నాగార్జున, సర్పంచ్‌లు సిద్దేశ్, మల్లయ్య, మహేష్ ఉన్నారు.

ముగ్గురు దొంగల అరెస్ట్



దొంగల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ యుగంధర్‌బాబు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణ శివారులోని రెడ్డిస్‌కాలనీ, సాయిజిత్ కాలనీల్లోని రెండు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడిన ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ యుగంధర్‌బాబు తెలిపారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. జూలై నెల 28వ తేదీన రెడ్డీస్‌కాలనీ, సాయిజిత్ కాలనీలో ఐదుగురు దొంగలు విలువైన బంగారు ఆభరణాలు, వస్తువులను దోచుకెళ్లారు. దొంగతనానికి పాల్పడిన వారిలో చిత్తూరు జిల్లాకు చెందిన హేమంత్, షేక్‌మస్తాన్, బెంగళూరుకు చెందిన పాల్‌రాజ్ ఆంటోనిని శుక్రవారం స్థానిక రైతునగరం సమీపంలో అరెస్ట్ చేశారు. వారి నుంచి పాస్‌పోర్ట్, రెండు సెల్ ఫోన్‌లు, రూ. 1.50 లక్షల నగదు, రెండు ఐపాడ్‌లు, 2 తులాల బంగారు గొలుసు, 5 గ్రాముల బంగారు ఉంగరం, 4 గ్రాముల కమ్మలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నామన్నారు. సమావేశంలో సీఐలు అస్రార్‌బాషా, సురేష్‌బాబు, నిరంజన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఎస్‌ఐ గంగయ్యయాదవ్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

క్వింటా పత్తి రూ.8 వేలు

ఆదోని రూరల్: స్థానిక వ్యవసాయమార్కెట్ యార్డులో శనివారం పత్తి క్వింటా రూ.8 వేలు పలికింది. గత వారంలో రూ.7,800 నుంచి రూ.7,950 వరకు పలికిన పత్తి ధర.. శుక్ర, శనివారాల్లో రూ.8 వేలకు చేరింది. యార్డుకు 585 క్వింటాళ్ల పత్తి రాగా గరిష్ఠ ధర రూ.8,015, మధ్య ధర రూ.7,449, కనిష్ఠ ధర రూ.4,211 నమోదైంది. వేరుశనగకాయలు 2,290 క్వింటాళ్లు కాగా.. క్వింటా గరిష్ఠ ధర రూ.7,339, మధ్య ధర రూ.6,679, కనిష్ఠ ధర రూ.3,289 నమోదయ్యింది. ఆముదాలు 40 క్వింటాళ్లు రాగా క్వింటా గరిష్ఠ ధర రూ.5,713, మధ్య ధర రూ.5,560, కనిష్ఠ ధర రూ.4211 నమోదయ్యింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం





జయకుమార్, డేవిడ్ పాల్ (ఫైల్)



బైక్‌ను ఢీకొన్న లారీ

వెల్దుర్తి: మండల పరిధిలోని మదార్‌పురం గ్రామ సమీపంలో హైవే 44పై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. మృతదేహాలపై లారీ చక్రాలు ఎక్కడంతో కొన్ని అవయవాలు తెగిపడగా, మిగతా భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. డోన్‌లోని టీచర్స్ కాలనీకి చెందిన పాలెం జయకుమార్(49), పొట్టపాటి డేవిడ్ పాల్(50) స్నేహితులు. జయకుమార్ ఆర్‌అండ్‌బీలో ప్రైవేట్ సర్వేయర్‌గా పనిచేస్తుండగా అతనికి పాల్ సహాయకుడిగా ఉండేవాడు. శనివారం ఇద్దరూ కలిసి బైక్‌పై వెల్దుర్తికి వెళ్లి అక్కడ పని ముగించుకుని డోన్‌కు తిరుగు పయనమయ్యారు. మదార్‌పురం దాటిన తర్వాత నూతనంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంక్ వద్దకు రాగానే వెనుక నుంచి రాజస్తాన్‌కు చెందిన లారీ వీరి బైక్‌ను వేగంగా ఢీకొంది. కిందపడిన వీరిపై లారీ చక్రాలు ఎక్కడంతోపాటు బైక్‌ను కొంతదూరం ఈడ్చుకుంటూ వెళ్లింది. డ్రైవర్ లారీని అక్కడే నిలిపి పరారయ్యాడు. జయకుమార్‌కు భార్య గౌరి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పాల్‌కు పెళ్లి కాలేదు. హైవే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. వెల్దుర్తి ఏఎస్‌ఐ శివరామిరెడ్డి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నారు.



మీరు భద్రం పోలీసన్నో!

ఓర్వకల్లులో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటైంది. ముందుగా పత్తికొండ నియోజకవర్గంలో పర్యటన ఖరారైనప్పటికీ, వర్షాల కారణంగా ఓర్వకల్లుకు మార్పు చేశారు. దీంతో అధికార యంత్రాంగమంతా ఉరుకులు పరుగుల మీద రాత్రికి రాత్రి అక్కడికి చేరుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసులు ఓర్వకల్లు చేరుకునేందుకు ఎదుర్కొన్న అవస్థలు వర్ణనాతీతం. ఇద్దరు పోలీసులు ఓ మినీ ట్రక్కు వెనుక ప్రమాదకరంగా ఓర్వకల్లుకు చేరుకోవడం చూసి భద్రత కల్పించే వీళ్లకే ఇలాంటి పరిస్థితి వచ్చిందేంటని వాహన చోదకులు చర్చించుకోవడం కనిపించింది. అయితే ఎట్టకేలకు చంద్రబాబు పర్యటన రద్దయింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు